పార్వతీపురం ఐటిడిఎ పరిధిలోని పనిచేస్తున్న సిఆర్‌టిలను, భాషా వాలంటీర్లను రెన్యువల్ చేయాలని కోరుతూ యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధానకార్యదర్శులు టి.రమేష్, ఎస్.మురళీమోహన్ ఆధ్వర్యాన ఐటిడిఎ కార్యాలయం వద్ద సోమవారం నిరసన తెలిపారు. అయితే అధికారుల నుంచి ఎలాంటి స్పందనా రాకపోవడంతో కలెక్టరేట్ వద్దకు వచ్చి ధర్నా చేపట్టారు.

-ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

# విజృంభిస్తున్న మలేరియా

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

వర్షాకాలం వచ్చిందంటే చాలు మన్యంలో మలేరియా విజృంభిస్తోంది. గిరిజనులు, విద్యార్థులు మలేరియా దోమ కాటుకు గురై జ్వరాల బారిన పడుతున్నారు. ఆసుపత్రులకు వెళ్తున్న వీరికి మలేరియా మందులు అందుబాటులో లేకపోవడంతో సరైన వైద్యమందక మృత్యువాత పడుతున్నారు. రెండు రోజుల వ్యవధిలో ఇద్దరు గిరిజన విద్యార్థులు మృతి చెందారు. ఇందులో భాగంగానే గుమ్మలక్ష్మీపురం మండలం వంగరకు చెందిన నాలుగో తరగతి విద్యార్థి ఎం.గౌతమ్ మలేరియా జ్వరంతో మరణించాడు. తాడికొండ పిహెచ్సికి వైద్యం కోసం తీసుకువెళ్లగా మలేరియా మందులు అందుబాటులో లేవని సాధారణ మాత్రలతో సరిపెట్టారని బాలుని తల్లి ఆవేదన వ్యక్తం చేసింది. మరోవైపు పార్వతీపురం మండలం రావికోన ఆశ్రమ పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్న విద్యార్థి జ్వరంతో మృతి చెందాడు. గత కొన్నేళ్లుగా ఇటువంటి మలేరియా మరణాలు జరుగుతున్నా ప్రభుత్వాలు, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు నివారణా చర్యలు చేపట్టడంలో పూర్తిగా విఫలమయ్యారన్న విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి. ప్రతి ఏడాది సీతంపేట, సాలూరు, భద్రగిరి ఏజెన్సీ ప్రాంతాల్లో జ్వర పీడితుల రాకతో ఆస్పత్రులు కిటకిటలాడుతున్నాయి. మలేరియా, డెంగీ, టైఫాయిడ్ వంటి వ్యాధులతో వందలాది సంఖ్యలో ప్రజలు వైద్యం కోసం ఆసుపత్రాలకు వస్తున్నారు. గిరిజన ప్రాంతాల్లో సరైన వైద్యమందక పదుల సంఖ్యలో మలేరియా జ్వరంతో విద్యార్థులు మృత్యుఒడికి చేరుతూనే ఉన్నారు. చదువుకొనే పసిప్రాయంలో చిన్నారులు మరణించడంతో తల్లిదండ్రులకు కడుపుశోకం మిగిల్చుతున్నారు. ఏజెన్సీ ప్రాంతంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మలేరియా మందులు అందుబాటులో లేకపోవడంతో గిరిజనులకు మలేరియా వైద్యం అందని ద్రాక్షగా మిగిలింది. కొద్దో గొప్పో ఆర్థికంగా ఉన్న వారు ప్రైవేటు ఆసుపత్రికి వెళ్లి వైద్యం చేయించుకుంటున్నారు. నిరుపేదలు ప్రభుత్వ వైద్యంపైనే ఆధారపడుతున్నారు. కొత్త ప్రభుత్వంలోనైనాఏజెన్సీ ప్రాంతంలో మలేరియా నివారణకు చర్యలు చేపట్టాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. వర్షాకాలంలో పెరుగుతున్న రోగుల దృష్ట్యా ప్రభుత్వ ఆసుపత్రుల్లో మలేరియా, డెంగీ మందులు అందుబాటులో ఉంచి స్థానికంగా మెరుగైన వైద్య సేవలందించే దిశగా చర్యలు తీసుకోవాలని గిరిజన సంఘాల నాయకులు కోరుతున్నారు.

## మృత్యుఒడిలోకి విద్యార్థులు
## సేవలు అంతంత మాత్రమే

### మరో విద్యార్థి మృతి

పార్వతీపురం రూరల్ : మండలంలోని రావికోన గిరిజన సంక్షేమ వసతి గృహ విద్యార్థి మృతి చెందిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాలిలా ఉన్నాయి. మక్కువ మండలం దుగ్గేరుకు చెందిన పి.రాఘవ ఈ నెల 13న తన కుటుంబీకులతో కలిసి దుగ్గేరు వెళ్లాడు. విద్యార్థి కోసం ఈనెల 16న హాస్టల్ వార్డెన్ ఫోన్లో సంప్రదించగా జ్వరంతో పార్వతీపురం జిల్లా కేంద్రాసుపత్రిలో చికిత్స పొందుతున్నారని తెలిపారు. వెంటనే ఆయన స్పందించి హాస్పటల్‌కు వెళ్లగా, వైద్యులు విద్యార్థిని విజయనగరం ఘోషాస్పత్రికి రిఫర్ చేశారు. అక్కడ వారు కూడా మెరుగైన వైద్యం కోసం విశాఖ కెజిహెచ్‌కు తరలించారు. ఈ విషయాన్ని వార్డెన్ ఐటిడిఎ అధికారుల దృష్టిలోకి తీసుకువెళ్లి వారి సూచనల మేరకు ఈనెల 17న కేజీహెచ్‌లో చేర్చారు. అక్కడ వైద్యం ఆదివారం విద్యార్థి మతి చెందాడు. విద్యార్థి మృతికి కారణం సెరిబ్రెల్ మలేరియాగా వైద్యులు గుర్తించినట్లు తెలిపారు. జిల్లాలో వైరల్ జ్వరాలతో సంక్షేమ వసతి గృహ విద్యార్థులు వరుస మరణాలు జరుగుతుండడంతో వసతి గహాల్లో ఏఎన్ఎంల నియామకం వెంటనే జరగాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుకుంటున్నారు .

విద్యార్థి కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న గిరిజన సంఘం నాయకులు

### విద్యార్థి కుటుంబానికి రూ.25 లక్షలు పరిహారం ఇవ్వాలి

**ఆదివాసీ గిరిజన సంఘం డిమాండ్**

మలేరియా జ్వరంతో మృతి చెందిన గౌతమ్ కుటుంబ సభ్యులకు ప్రభుత్వం రూ.25 లక్షలు నష్టపరిహారం చెల్లించాలని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి కోలక అవినాష్, కోశాధికారి మండంగి రమణ డిమాండ్ చేశారు. విద్యార్థి కుటుంబాన్ని గిరిజన సంఘం నాయకులు సోమవారం సాయంత్రం పరామర్శించారు. విద్యార్థి మతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. పూర్తిస్థాయిలో వైద్యం అందించకుండా వైద్యులు ఇంటికి పంపడం దారుణమన్నారు. విద్యార్థి మృతికి వైద్య సిబ్బంది నిర్లక్ష్యం ఎక్కువగా కనిపిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు స్పందించి ప్రతి గ్రామంలో మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేసి గిరిజనులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని డిమాండ్ చేశారు.

విద్యార్థి కుటుంబానికి ఆర్థికసాయాన్ని అందజేస్తున్న టిడిపి నాయకులు

### గౌతమ్ కుటుంబానికి టిడిపి నాయకుల పరామర్శ

మలేరియా జ్వరంతో ఆదివారం మృతి చెందిన గిరిజన విద్యార్థి కుటుంబాన్ని సభ్యులను టిడిపి, జనసేన నాయకులు సోమవారం పరామర్శించారు. ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి సూచన మేరకు వంగర వెళ్లి కుటుంబ సభ్యులను ఓదార్చి, కొంత ఆర్థిక సహాయం చేశారు. కార్యక్రమంలో తెలుగు మహిళ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బిడ్డిక పద్మావతి, నియోజకవర్గ తెలుగు మహిళ ప్రధాన కార్యదర్శి వెంపటాపు భారతి, అరకు పార్లమెంటు మహిళా విభాగం కార్యదర్శి కడ్రక కళావతి, ట్రైబల్ రైట్స్ ఫోరం రాష్ట్ర అధ్యక్షులు రొబ్బా లోవరాజు, జనసేన నియోజకవర్గం ఇంచార్జ్ కడ్రక మల్లేష్, మండంగి భూషణ, జానకి, నాగవేణి ఉన్నారు.

ఆస్పత్రిలో చిన్నారి ఆరోగ్య పరిస్థితిని పరిశీలిస్తున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

# సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత

ప్రజాశక్తి - సాలూరు

ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో భాగంగా సోమవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో జాయింట్ కలెక్టర్ ఎస్-ఎస్ శోభిక, ఆర్‌డిఒ కె.హేమలతతో కలిసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ప్రజలు పలు సామాజిక, వ్యక్తిగత సమస్యలకు పరిష్కారం కోరుకుంటూ అర్జీలు అందజేశారు. అర్జీ ల పరిష్కారం నిమిత్తం సంబంధిత అధికారులకు జిల్లా కలెక్టర్ అదేశాలు, సూచనలు అందజేశారు. అనంతరం కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ ప్రతి మంగళవారం, శుక్రవారం క్షేత్ర స్థాయి సందర్శన చేయాలని తెలిపారు. భారీ వర్షాల నేపథ్యంలో రోడ్ల మరమ్మతులు, కొత్త రోడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు తయారు చేసి పంపించాలని ఆదేశించారు. రోడ్లు, భవనాలు, పంచాయతీ రాజ్, జలవనరులు, వ్యవసాయ శాఖ అధికారులు వర్షాలు వల్ల జరిగిన నష్టంపై నివేదిక అందించాలని కోరారు. పత్రికల్లో వచ్చే వార్తలకు అధిక ప్రాధాన్యత ఇచ్చి చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి శాఖ వంద రోజులు కార్యాచరణ రూపొందించాలని తెలిపారు. ప్రతి నెల రెండు బ్లడ్ క్యాంపులు నిర్వహించాలని తెలిపారు. జెసి మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో సుమారు 287 అర్జీలు అందాయని వాటిపై వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి అర్జీ పరిష్కారం పై పర్యవేక్షణ ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో అన్నిశాఖల జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

**సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తం**

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఎం.శ్యామ్ ప్రసాద్ వైద్యులకు సూచించారు. సోమవారం సాలూరులో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించేందుకు విచ్చేసిన కలెక్టరు స్థానికఏరియా హాస్పిటల్‌ను తనిఖీ చేశారు. చికిత్స పొందుతున్న రోగులతో మాట్లాడారు. వైద్య సేవల పట్ల ఆరా తీశారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని స్పష్టం చేశారు. ఏరియా ఆసుపత్రి పరిధిలో రక్తహీనత సమస్యలపై ఆరా తీశారు. ఆసుపత్రికి వచ్చే ప్రతి ఒక్కరికీ రక్త నమూనా సేకరించి రక్తహీనతను పరిశీలించాలని ఆయన ఆదేశించారు. రక్త హీనత నివారణలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని కోరారు. అంగన్వాడీల్లో చిన్నారులకు, గర్భిణీలకు, బాలింతలకు పౌష్టిక ఆహారం విధిగా అందాలని, దీనిని పక్కాగా పర్యవేక్షించాలని చెప్పారు. జిల్లాలో రక్త నిల్వలు తక్కువగా ఉన్నాయని, కావున జిల్లాలో రక్త కణాల విభజన యూనిట్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. సాలూరులో ప్రస్తుతం 50 పడకలు ఉన్నాయని, వంద పడకలకు పెంచి నిర్మాణం చేస్తున్నట్టు తెలిపారు. రోగుల తాకిడి ఎక్కువగా ఉన్నందున తాత్కాలిక షెడ్‌ను రూ.10 లక్షలతో నిర్మించేందుకు మంజూరు చేశామని చెప్పారు. రోగులకు మెడికల్ సిబ్బంది అందుబాటులో ఉండాలని, మందులు సమయానికి ఇవ్వాలని ఆదేశించారు. మలేరియా, డెంగీ కేసులు నమోదు అవుతున్నాయని, నియంత్రణలో ఉన్నప్పటికీ పూర్తి అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ప్రజలు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు, పరిసరాల పరిశుభ్రత పాటించాలని కోరారు. కలెక్టర్ వెంట డిప్యూటీ డిఎంహెచ్ఒ శివకుమార్, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రత్నకుమారి,వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

# జిల్లాలో పీజీ సెంటర్లు ఏర్పాటు చేయాలి

## ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు రామ్మోహన్

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

ఉన్నత విద్యను అందించడంలో గత, ప్రస్తుత ప్రభుత్వాలు విఫలమయ్యాయని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.రామ్మోహన్ విమర్శించారు. సోమవారం స్థానిక గిరిజన సామాజిక భవనంలో జరిగిన ఎస్ఎఫ్ఐ జిల్లా 31వ ప్లీనరీ సమావేశాలు జరిగాయి. తొలుత ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు కె.రాజు ప్లీనరీ ప్రారంభ సూచికగా పతాకావిష్కరణ చేపట్టారు. రామ్మోహన్ భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం రామ్మోహన్ మాట్లాడితూ ప్రభుత్వ వైఫల్యాల వల్ల విద్యారంగం గాడి తప్పుతుందని, ప్రాథమిక విద్యను తునా తునకలం చేస్తుందని, నేటికీ నీట్ స్కామ్‌ను బట్టబయలు చేయకపోవడం ప్రభుత్వ పాత్ర క్షుణ్ణంగా కనిపిస్తుందని అన్నారు. విద్యార్థులు మాదకద్రవ్యాలకు, చెడు వ్యసనాలతో దూరంగా ఉండాలని, విద్యారంగం వ్యవస్థలో జరుగుతున్న ప్రతి ఒక్క మోసానులను, ప్రభుత్వ కుట్రలను వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. జిల్లా కార్యదర్శి డి.పండు ప్లీనరీ నివేదికను ప్రవేశపెట్టారు. ఇంటర్ విద్యార్థులకు ఉచిత పాఠ్య పుస్తకాలు, యూనిఫామ్స్ ఇవ్వాలని, మధ్యాహ్నం భోజన పథకం అమలు చెయ్యాలనీ, డిగ్రీ ఆన్లైన్ అడ్మిషన్ విధానాన్ని రద్దు చెయ్యాలని, 100% సీట్లు కన్వీనర్ కోటలోనే భర్తీ చెయ్యాలని, ఆరు నెలలుగా బకాయిలు ఉన్న మెనూ చార్ట్ వెంటనే విడుదల చెయ్యాలని, పెండింగ్ లో ఉన్న విద్యా దీవెన విడుదల చెయ్యాలని, పార్వతీపురంలో మహిళ జూనియర్ కళాశాల నిర్మించాలని, పాలకొండలో పోస్టుమెట్రిక్ కాలేజీ బాయ్స్ హాస్టల్‌ను సొంత భావనం నిర్మించాలని, సీతంపేట, గుమ్మలక్ష్మీపురం, మక్కువ, పాచిపెంట సీతానగరం, కొమరాడ మండల కేంద్రాల్లో డిగ్రీ కాలేజీలు ఏర్పాటు చేయాలని, వీరఘట్టం ప్రభుత్వ డిగ్రీ కాలేజీకి సొంత భవనం నిర్మించాలని, జిల్లాలో యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని, కార్పొరేట్ స్కూల్స్, కాలేజ్‌ల్లో ఫీజులు, పుస్తకాలు నియంత్రించాలని, సంక్షేమ హాస్టల్ బిల్డింగ్లు వెంటనే నిర్మించాలని నిర్మించారు. ఈ సమస్యలను ఉన్నతా అధికారులు స్పందించి పరిష్కరించాలని, లేకుంటే భవిష్యత్తులో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

శిక్షణా తరగతుల్లో మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు రామ్మోహన్

**17 మందితో నూతన జిల్లా కమిటీ ఎన్నిక**

జిల్లా అధ్యక్షులు కె.రాజు కార్యదర్శి డి.పండుతో పాటు, కోశాధికారిగా అఖిల్, గర్ల్స్ కన్వీనర్ రోజా, ఉపాధ్యక్షులుగా గంగారాం, సహాయ కార్యదర్శిగా పి.రాజశేఖర్, జిల్లా కమిటీ సభ్యులుగా 11మందిని ప్లీనరీ ఏకగ్రీవంగా ఎన్నుకుంది.

# కేంద్రం కరుణించేనా?

- గిరిజన వర్శిటీకి నిధుల కొరత
- అద్దె కొంపలో తరగతుల నిర్వహణ
- తగ్గిన రైలు సదుపాయాలు
- నేడు కేంద్ర బడ్జెట్

**కేంద్రంలో మూడోసారి అధికారం లోకి వచ్చిన బిజెపి ప్రభుత్వం మంగళవారం ప్రవేశపెట్టనున్న సంవత్సరాంతపు బడ్జెట్ సమావేశంలో జిల్లాపై కరుణ చూపనుందా? లేక ఎప్పటి మాదిరిగానే నిరాశ పర్చనుందా? అనే చర్చ ఉమ్మడి విజయనగరం జిల్లాలో సాగుతోంది. కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంట్‌లో బడ్జెట్ ప్రవేశపెట్ట నున్నారు. దీంతో, జిల్లాకు ఎలాంటి మేలు చేస్తారన్న దానిపై ఆద్యంతం ఆసక్తికర చర్చ నడుస్తోంది. పన్నుల మినహాయింపులపై మధ్య తరగతి, విభజన హామీలు అమలుపై జిల్లా ప్రజలు ఆశతో ఎదురు చూస్తున్నారు.**

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

రాష్ట్ర విభజనలో భాగంగా 2014లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ఎపికి ప్రత్యేక హోదా ఇవ్వడంతోపాటు వెనుకబడిన జిల్లాలకు ప్రత్యేక నిధులు విడుదల చేస్తామని చెప్పిన సంగతి తెలిసిందే. తొమ్మిది కేంద్రీయ విద్యాలయాల ఏర్పాటుకు కూడా విభజన చట్టంలో పేర్కొంది. ఈ హామీలన్నీ అమలు చేస్తామని కూడా నమ్మబలికారు. హామీల్లో ముఖ్యంగా కేంద్రీయ గిరిజన వర్శిటీ ఏర్పాటు పట్ల కేంద్ర ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శించింది. రెండోసారి అధికారం కోసం 2019 ఎన్నికలకు ముందు వర్శిటీ ఏర్పాటుకు అనుమతులు ఇచ్చింది. ఏరుదాటాక తెప్పను తగలబెట్టిన చందంగా రెండోసారి అధికారంలోకి రాగానే తిరిగి విస్మరించింది. మూడోసారి అధికారం కోసం ఇటీవల జరిగిన ఎన్నికలకు ముందు 2023 ఆగస్టు 25న కేంద్ర కేంద్ర మానవ వనరుల శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రదాన్ జిల్లాకు వచ్చి వర్శిటీ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. నిర్మాణ పనులకు రూ.834కోట్లు కేటాయించినట్టు ప్రకటించారు. కానీ, ఇప్పటికీ నిధులు కేటాయించక పోవడంతో పనులు ఒక్క అడుగు కూడా వేయలేదు. దీంతో, తరగతులు, ప్రయోగాలు ప్రవేటు పంచల్లో నిర్వహిస్తున్నారు. కనీసం హాస్టల్ సదుపాయం కూడా కల్పించకపోవడంతో విద్యార్థులు పడుతున్న అవస్థలు అన్నీ,ఇన్నీ కావు. విభజన చట్టం ప్రకారం ఆరేళ్లపాటు ఏటా రూ.50కోట్ల చొప్పున జిల్లాకు కేంద్ర ప్రభుత్వం ఇవ్వాల్సివున్నప్పటికీ అమలు చేయలేదు. జిల్లాకు కేవలం 64కోట్లు ఇచ్చి తేతులు దులిపేసుకుంది. ఒకానొక దశలో ఇచ్చిన నిధులను కూడా వెనక్కు తీసుకున్న సందర్భం ఉంది. ఇక జిల్లాలో రైల్వే సదుపాయాలు అంతంతమాత్రంగానే ఉన్నాయి. విజయనగరం జంక్షన్‌లోనూ చాలా సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌లు ఆగడం లేదు. రైల్వేస్టేషన్ల ఆధునీకరణ పనులు ముందుకు సాగడం లేదు. కొత్తగా ప్రతిపాదించిన రైలు మార్గాల ఊసేలేదు. రోజూ గంటన్నర వ్యవధిలో నడిచే వ్యవధిలో నడిచే విశాఖపట్నం - రాయ్‌పూర్, విశాఖపట్నం - కొరాపుట్ రైళ్లను ఒకే సమయంలో నడపడంతో ఉద్యోగులు, వ్యాపారులు, ఇతర ప్రయాణికులకు ఇబ్బందికరంగా మారింది. దేశంలో ఎక్కడా రైల్వే క్రాసింగ్‌లు లేకుండా చేస్తామన్న రైల్వేశాఖా మంత్రి చెప్పిన మాటలు మచ్చుకైనా అమలు కాలేదు. విశాఖ కేంద్రంగా ఏర్పాటు చేయాల్సిన రైల్వే జోన్ ఊసెత్తకపోవడంతో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కూడా ఎండమావిగానే మిగిలిపోయాయి. ఈనేపథ్యంలో నేడు ప్రకటించనున్న కేంద్ర బడ్జెట్‌లో జిల్లాకు ఏమేరకు ప్రయోజనం చేకూరుతుందో వేచి చూడాల్సిందే.

తహశీల్దార్‌కు సమస్యను వివరిస్తున్న రైతు సంఘం నాయకులు కృష్ణమూర్తి

# దళితులకు న్యాయం చేయాల్సిన బాధ్యత అధికారులదే

ప్రజాశక్తి - గరుగుబిల్లి

మండలలోని శివ్వాంలో దళితుల భూములకు న్యాయం చేసే బాధ్యత రెవెన్యూ అధికారాలపైనే ఉందని ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.కృష్ణమూర్తి అన్నారు. సోమవారం ఆయన స్థానిక తహశీల్దార్ కె.జయను కలిశారు. శివ్వాం దళితుల భూములను పెత్తందార్లు ఛేజిక్కించుకోవాలని తప్పుగా కోర్టులో దావా వేసి 102 సర్వే నెంబర్ హద్దులు మార్చి, డి పట్టా భూములపై కోర్టును తప్పు త్రోవ పట్టించి ఇంజన్స్ ఆర్డర్ పొందారని తహశీల్దార్‌కు వివరించారు. ఈ విషయంపై ముందు ఉన్న రెవెన్యూ అధికారులు పెత్తందార్లకు అనుకూలంగా పనిచేసి దళితులకు అన్యాయం చేశారన్నారు. క్లెయిమ్స్ కలెక్షన్ లిటిగేషన్ రిపోర్ట్ (సి సిఎల్ఆర్) వారు రెవెన్యూ అధికారులకు బాధ్యతలు అప్పగించి 30 ఏళ్లు అయినా కాలయాపన చేసి ఇప్పటికీ సమాచారం ఇవ్వకపోవడం దళితులకు రెవెన్యూ అధికారులు అన్యాయం చేసినట్టేనన్నారు. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు సంబంధిత రికార్డులు పరిశీలించి దళితులకు న్యాయం చేయాలని కోరారు.

**కొనసాగుతున్న శివ్వాం దళితుల నిరసన దీక్షలు**

**పార్వతీపురం టౌన్ :** తమను కొట్టిన పెత్తందారులను అరెస్ట్ చేయాలని, మా భూములు మాకే అప్పగించాలని గరుగుబిల్లి మండలం శివ్వాం గ్రామ దళితులు స్థానిక కలెక్టరేట్ వద్ద చేపట్టిన రిలేనిరాహారదీక్షలు సోమవారం 8వ రోజు కూడా కొనసాగాయి. వీరి ఆందోళనకు సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి టి.జీవ మద్దతు తెలిపారు. తక్షణమే అధికారులు స్పందించి దళితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

# ఆర్ఎంపిల ఆపరేషన్లను అరికట్టాలి

- గిరిజనులకు అందుబాటులో పిహెచ్‌సిలు ఏర్పాటు చేయాలి
- మందులు షాపుల్లో వైద్యాన్ని నిరోధించాలి : సిపిఎం

ప్రజాశక్తి - మక్కువ

మండలంలోని కొంతమంది ఆర్ఎంపి వైద్యులు ఏ విధమైన అర్హత లేకుండా ఏకంగా ఆపరేషన్లు కూడా చేసేస్తున్నారని, అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కె.గంగు నాయుడు డిమాండ్ చేశారు. గిరిజనులకు అందుబాటులో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరారు. ఏజెన్సీ ప్రాంతంలో జ్వరాలు విజృంభిస్తున్న నేపథ్యంలో సోమవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా డాక్టర్ నికిలతో మాట్లాడారు. ఈ పిహెచ్‌సిలో మలేరియా, డెంగీ జ్వరాలకు టెస్టింగ్ పరికరాలు, మందులు అందుబాటులో ఉన్నా యని ఆమె తెలిపారు. దీంతో ఇతర పిహెచ్‌సిల పరిధిలో ఉన్న రోగులు కూడా ఇక్కడికి వస్తున్నారన్నారు. కొన్ని మందులు చాలక పోతే పక్క పిహెచ్‌సిల నుంచి అప్పుగా తీసుకొస్తున్నారని గంగునాయుడు అన్నారు. దీంతో పాటు ఇతర విషయాలు తాము పరిశీలించగా మక్కువకు దుగ్గేరు ప్రాంతం నుంచి వచ్చిన గిరిజనులు పెద్ద ఎత్తున ఆర్ఎంపి డాక్టర్లను ఆశ్రయిస్తున్నారు. మక్కువ పిహెచ్‌సికి శంబర, మామిడిపల్లి, తోణాం పిహెచ్‌సిల పరిధిలో గల దుగ్గేరు, సిరివర, కొడమ, జగ్గుదొర వలస ప్రాంతాల గిరిజనులు వస్తున్నారన్నారు. ఇక్కడ రోగుల తాకిడి వల్ల గిరిజనులు ఎక్కువ మంది మక్కువలో గల ఆర్ఎంపి వైద్యులను ఆశ్రయిస్తున్నారన్నారు. కొంతమంది ఆర్ఎంపి వైద్యులు ప్రాథమిక వైద్యం అందిస్తున్నప్పటికీ, మరికొంతమంది అవసరానికి మించి వైద్యం చేస్తున్నారన్నారు. అంతేకాక ఆపరేషన్‌లే చేస్తున్నారని అన్నారు. ఇలా చేయడం వల్ల గిరిజన ప్రాంతాల్లో మరణాలు సంభవిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఆర్ఎంపిలే కాకుండా మక్కువలో కొన్ని మెడికల్ షాపుల్లో ఇన్ పేషెంట్లుగా వైద్యం అందిస్తున్నారని, ఇది తెలిసినా డ్రగ్స్ కంట్రోల్ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నా రని విమర్శించారు. మెడికల్ షాపు యజమా నులు ఎక్కువ శాతం శాంపిల్ డ్రగ్ వాడుతున్నా రని, వీటివల్ల కొంత మందికి ఆరోగ్యం వికటిస్తుందని అన్నారు. కావున ప్రభుత్వం అన్ని పిహెచ్‌సిల్లో వైద్య సౌకర్యాలు మెరుగుపర్చాలని డిమాండ్ చేశారు. అలాగే మక్కువ పిహెచ్‌సిలో ఖాళీగా ఉన్న సూపర్‌వైజర్, ఆయుర్వేద డాక్టర్, అయుర్వేద కాంపౌండర్ పోస్టులు భర్తీ చేయాలని, శంబర పిహెచ్‌సిలో ఖాళీ పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. శంబర, మామిడిపల్లి, తోణాం పిహెచ్‌సిలకు రోడ్లు లేక వెళ్లలేని దుగ్గేరు, కొదమ, శిరివర, జగ్గుదొరవలస ప్రాంతాల గిరిజనులకు అందుబాటులో ఉన్న దుగ్గేరు, ఎర్రసామంత వలసలో పిహెచ్‌సిలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అవసరానికి మించి వైద్యం చేస్తున్న ఆర్ఎంపి డాక్టర్లకు డిఎంహెచ్ఒ అవగాహన కల్పించాలని కోరారు. అలాగే మెడికల్ షాపు యజమానులకు డ్రగ్ ఇన్స్పెక్టర్ మెడికల్ షాపు ల్లో వైద్యం కూడదని హెచ్చరిక జారీ చేయాలని కోరారు.

వైద్యాధికారికి సమస్యలను వివరిస్తున్న గంగునాయుడు

# నేటి నుంచి 27 వరకు ఆధార్ నమోదు కేంద్రాలు

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఈనెల 23 నుంచి 27వరకు ఆధార్ నమోదు చేయనున్నట్టు మున్సిపల్ కమిషనర్ కె. శ్రీనివాస్ తెలిపారు. ఇందులో భాగంగా ఈనెల 23, 24 తేదీల్లో చర్చివీధిలోని సచివాలయం, శ్రీవాసవీ జూనియర్ కళాశాలలో ఆధార్ నమోదు క్యాంపు నిర్వహిస్తామన్నారు. ఈ నమోదు కార్యక్రమంలో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల, వేదాంత జూనియర్ కళాశాల, వాసవి జూనియర్ కళాశాల, టి ఆర్ ఎం ఎం ఉన్నత పాఠశాలలో ఉన్న విద్యార్థిని, విద్యార్థులు ఆధార్ నమోదు ప్రక్రియను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈనెల 25,26 తేదీల్లో గాంధీనగర్ సచివాలయంలో పరిధి గల ప్రజలు, భాస్కర్ కాలేజీలో ఉన్న విద్యార్థిని విద్యార్థులు, మేదరి వీధి రెండవ సచివాలయం ఏరియాలో ఉన్న ప్రజలు ఆధార్ నమోదు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కొత్తవలస -2వ సచివాలయంలో కెపిఎం స్కూల్‌లో ఉన్న విద్యార్థులు, శ్రీవెంకటేశ్వర ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉన్న విద్యార్థులు, కొత్తవలస ఏరియాలో ఉన్న ప్రజలు ఈ ఆధార్ నమోదు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని, 27న కొత్త బెలగాంలో గల 8వ సచివాలయంలో జరిగే ఆధార నమోదు కార్యక్రమంలో బెలగాం అంగన్వాడీ కేంద్రాల పిల్లలు, బంగారమ్మ కాలనీ ప్రజలు, కొత్త బెలగాంలో ఉన్న ప్రజలు, మేదర వీధి సచివాలయం-1లో జరిగే ఆధార్ నమోదు కార్యక్రమంలో పట్టణంలో ఉన్న అంగన్వాడీ కేంద్రాల్లో ఉన్న పిల్లలకు, శంక వీధి ఏరియాలోని ప్రజలకు, జగన్నాథపురం ఏరియా ప్రజలకు ఆధార్ నమోదు కార్యక్రమం జరుగుతుందని ఈ అవకాశాన్ని ఆయా ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ తెలియజేశారు .

# వీరఘట్టంలో ఫ్యామిలీ డాక్టర్

ప్రజాశక్తి - వీరఘట్టం

స్థానిక మూడో సచివాలయం పరిధిలో సోమవారం 104 ఆధ్వర్యంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక వైద్యాధికారి పి.ఉమామహేశ్వరి జ్వర పీడితులతో పాటు వివిధ రకాలైన రోగులకు వైద్య తనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బందితోపాటు 104 సిబ్బంది పాల్గొన్నారు,

ప్రజాశక్తి
www.prajasakti.com



## సిఎం దృష్టికి నియోజకవర్గ సమస్యలు : ఎమ్మెల్యే


చంద్రబాబుకు నియోజక వర్గ సమస్యలను వివరిస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

కురుపాం నియోజకవర్గంలోని పూర్ణపాడు లాబేసు వంతెన నిర్మాణం పూర్తి చేయాలని, భద్రగిరి పిటిజి పాఠశాల డార్మెంటరీ, కళాశాల కొత్త భవనాలు మంజూరు చేయాలని, గిరిజన గ్రామాలకు రోడ్లు నిర్మించాలని కోరుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణిని కోరినట్లు ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి ఒక ప్రకటనలో తెలిపారు. అసెంబ్లీ సమావేశాలు సందర్భంగా పై సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకు వెళ్లానని ఆమె చెప్పారు. నియోజకవర్గంలో ఉన్న 5 పోలీస్ స్టేషన్లకు కొత్త భవనాలు మంజూరు చేయాలని హోంమంత్రి అనితను కోరినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

ఫిర్యాదుదారునితో మాట్లాడుతున్న ఎస్‌పి మాధవరెడ్డి

## సమస్యల పరిష్కార వేదికను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి పార్వతీపురం రూరల్

ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రతి సోమవారం జిల్లా పోలీసు అధికారి కార్యాలయంలో నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదికను సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీ ఎస్ వి మాధవరెడ్డి ప్రజలను కోరారు. జిల్లా ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన తర్వాత మొట్టమొదటి సారిగా 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక" కార్యక్రమాన్ని ఎస్పీ నిర్వహించిన ఫిర్యాదులు స్వీకరించారు. కార్యక్రమంలో పది ఫిర్యాదులు అందాయి. కార్యక్రమంలో సిఐ సిహెచ్. లక్ష్మణరావు, బిఎండి ప్రసాదరావు, ఎస్ఐ గోవిందరావు సిబ్బంది పాల్గొన్నారు.

## అందరి సహకారం మరువలేనిది

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక ఐటిడిఎలో పనిచేయడం చాలా ఆనందంగా ఉందని, ఎన్నికల సమయంలో మీ అందరి సహకారం మరువలేనిదని అన్నారు. సోమవారం పిఒగా పనిచేస్తూ తిరుపతి జాయింట్ కలెక్టర్‌గా బదిలీపై వెళ్తున్న శుభం బన్సల్‌కు ఐటిడిఎ అధికారులు, సిబ్బంది ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా పలువురు అధికారులు పిఒగా ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ఎపిఒ గణేష్, ఇఇ సింహాచలం, డిడి అన్నదొర, ఎఒ విజయరాణి, ఎంపిడిఒ గీతాంజలి, తహశీల్దార్ మహేశ్వరరావు, ఆర్ఐ వెంకటేష్, ఎఎంఒ కోటిబాబు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

మంత్రి నారాయణకు సమస్యలు వివరిస్తున్న ఎమ్మెల్యే జయకృష్ణ

## మంత్రి నారాయణను కలిసిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి - పాలకొండ

పురపాలక శాఖ మంత్రి నారాయణను సోమవారం అమరావతిలో స్థానిక ఎమ్మెల్యే నిమ్మక జయక్రిష్ణ, టిడిపి పట్టణ అధ్యక్షులు గంటా సంతోష్ మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మంత్రి దృష్టికి పలు సమస్యలు తీసుకొచ్చారు. నగర పంచాయతీలో సిబ్బంది నియామకంతో పాటు నానప్రుత పథకం పూర్తి చేయాలని కోరారు. దీనికి మంత్రి సానుకూలంగా స్పందించారు.

విద్యార్థులు రూపొందించిన వస్తువులను పరిశీలిస్తున్న డిఇఒ పగడాలమ్మ

## పాఠశాలను సందర్శించిన డిఇఒ

ప్రజాశక్తి - సాలూరు

పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సోమవారం డిఇఒ జి.పగడాలమ్మ సందర్శించారు. కేంద్రం రూపొందించిన నూతన విద్యా విధానం అమలులో భాగంగా శిక్షా సప్తాహ్‌లో విద్యార్థులు స్థానిక వనరులతో రూపొందించిన వస్తువులను పరిశీలించారు. వారిని అభినందించారు. విద్యార్థుల్లో దాగివున్న ప్రతిభాపాటవాలను వెలికితీయాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ డిఇఒ బి.రాజ్ కుమార్, స్టాఫ్ సెక్రటరీ కెవిఎస్ నారాయణ వున్నారు.

## శ్రీనివాస్ ఆయిల్ మిల్లుపై కలెక్టర్‌కు ఫిర్యాదు

ప్రజాశక్తి - కురుపాం

శ్రీనివాస్ ఆయిల్ మిల్లుపై కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌కు ఫిర్యాదు చేసినట్లు లక్ష్మీ బాలాజీ ఆయిల్ మిల్ కంపెనీ మేనేజర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లక్ష్మీ బాలాజీ ఆయిల్ పామ్ కంపెనీ తమ గ్రామాల పరిధిలో ఉన్న ఆయిల్ పామ్ గెలలను శ్రీనివాస ఆయిల్ మిల్ వారు చట్ట వ్యతిరేకంగా తరలించుకుని పోతున్నారని కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీనికి కలెక్టర్ సానుకూలంగా స్పందించి ఉద్యానవన శాఖ అధికారుల నుంచి తగు సమాచారం ఇస్తే వారిపై చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారని తెలిపారు.

## సమస్యల పరిష్కారానికి వినతి

ప్రజాశక్తి - బలిజిపేట

మండలంలోని వివిధ రకాల సమస్యలపై స్థానిక తహశీల్దార్ ఎల్‌వి జగన్నాథం కు వ్యవసాయ కార్మిక సంఘం, రైతు కూలీ సంఘం నాయకులు సోమవారం వినతి అందజేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు గేదెల సత్యనారాయణ మాట్లాడుతూ పెట్టుబడి సాయం కింద రైతుకు రూ.20వేలు ఇస్తామని చెప్పి ఖరీఫ్ ప్రారంభమై నెలరోజు గడుస్తున్న ఇంకా సాయం ఇవ్వకపోవడం రైతులను ప్రభుత్వం మోసగించడమేనన్నారు. పంటలు భీమా ఇంప్లిమెంటేషన్ చేయాలని, ఉపాధి హామీ బిల్లులు చెల్లించాలని, కౌలు రైతుల సమస్యలను యుద్ధ ప్రాతిపదికన పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో నల్ల ఈశ్వరరావు, ఇతర నాయకులు పాల్గొన్నారు.


తహశీల్దార్‌కు వినతిని అందజేస్తున్న రైతు సంఘం నాయకులు

# మౌలిక సదుపాయాలు కల్పించాలని నిరసన

ప్రజాశక్తి - పాలకొండ

మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరుతూ స్థానిక నగర పంచాయతీ కార్యాలయం వద్ద ప్రజాసంఘాల ఆధ్వర్యంలో బుట్టుమటం కాలనీ మహిళలు సోమవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా పట్టణ పౌరుసంఘాల ప్రతినిధి డి.రమణారావు, సిఐటియు మండల కార్యదర్శి కాద రాము మాట్లాడుతూ నగర పంచాయతీ పరిధిలో బుట్టిమట్టం కాలనీ 2002లో ఇళ్ల పట్టాలు మంజూరు చేసి వాటిని సుమోటాగా రద్దుచేసి 2006లో ఇళ్ల పట్టాలు మంజూరు చేశారన్నారు. లేఅవుట్లో కనీస మౌలిక సదుపాయాలు కల్పించలేదని, పాలకులు మారినా సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. కొత్త ప్రభుత్వం జోక్యం చేసుకొని పరిష్కరించాలని డిమాండ్ చేశారు. 15 ఏళ్లుగా కొంతమంది పేదలు ఇళ్లు నిర్మించుకొని నివాసం ఉంటున్నారని, వీరికి తాగునీరు, రోడ్లు, వీధి దీపాలు, మురికి కాలువలు లేకపోవడంతో అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పట్టణంలో డంపింగ్ యార్డ్, సంపూర్ణ పారిశుధ్య నివారణకు, మౌలిక సదుపాయాల కల్పనకు పాలకవర్గాలు నిర్లక్ష్యమే కారణమని విమర్శించారు. సమస్యల పరిష్కారానికి పట్టణ పౌరులంతా ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. అనంతరం కమిషనర్ సర్వేశ్వరరావుకు వినతి పత్రం అందజేశారు. దీనికి కమిషనర్ స్పందిస్తూ ఆ ప్రాంతమంతా పర్యటించి సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బుట్టిమట్టం కాలనీవాసులు ఎం.విజయమ్మ, ఎస్.సరోజిని, ఎస్.రాజేశ్వరి, ఎస్.సుశీల, ఎస్.లక్ష్మి, హెచ్.ఆదిలక్ష్మి, అరుణ, ఎన్.ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

నగర పంచాయతీ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న కాలనీవాసులు

## ఖరీఫ్ పూర్తయిన వెంటనే జైకా పనులు

ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి -మక్కువ

ఖరీఫ్ పూర్తయిన వెంటనే వెంగళరాయ సాగరం కాలువ పనులు జైకా నిధులతో చేపడతామని విఆర్‌ఎస్‌హెడ్ వర్క్స్ సబ్ డిఇఇ డి.సురేష్ తెలిపారు. సోమవారం 'ప్రజాశక్తి'లో ప్రచురితమైన 'జాలు వారని జైకా నిధులు' అన్న వార్తకు ఆయన స్పందించారు. మక్కువ మండలంలోని వెంగళరాయసాగరం రిజర్వాయరుకు రూ.63.50 కోట్ల అంచనాలతో జైకా నిధులతో ప్రాజెక్టు ఆధునికీకరణ పనులు చేపట్టేందుకు మంజూరు అయ్యాయన్నారు. ఈ పనుల్లో భాగంగా ఇప్పటి వరకు సదరు కాంట్రాక్టర్ సుమారు 22 శాతం పనులను మాత్రమే చేశారని పేర్కొన్నారు. నిధులు విడుదల జాప్యం వల్ల తదుపరి పనులను కాంట్రాక్టర్ ప్రస్తుతం నిలిపివేశారన్నారు. ప్రాజెక్టు పరిధిలో ఎల్‌బిసి కాలువపైన ఆక్విడక్ట్ కూలిపోవడం వల్ల చివరి ఆయకట్టుకు సాగు నీరు అందించలేకపోతున్నామని, మిగిలిన ఆక్విడెక్ట్ పనులు జైకా నిధులతో చేసేందుకు అనుమతులు వచ్చాయని ఆయన పేర్కొన్నారు. ఆక్విడక్ట్ పనులు త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎల్‌బిసి కాలువపైన కాదంబరి గెడ్డ వద్ద ఉన్న సైఫాన్ మరమ్మతులను జైకా నిధులతో చేపడతామని చెప్పారు. ప్రాజెక్టు పరిధిలో ఆర్ ఎమ్ సి లో 12ఎల్ కాలువ పనులను జైకా నిధులతో ఖరీఫ్ అయిన వెంటనే చేపడతామన్నారు. ఈ ఖరీఫ్ కు సాగునీటికి ఇబ్బంది లేకుండా 12 ఎల్ కాలువలో పుడికలు తీస్తున్నామని, ప్రాజెక్టు పరిధిలో ఆర్‌బిసిలో 13ఎల్ కాలువ ఆయకట్టుకు సాగు నీటికి ఇబ్బంది లేకుండా పూడికలు తీస్తున్నామని, మరమ్మతులను ఖరీఫ్ అయిన వెంటనే చేపడతామని సురేష్ వివరణ ఇచ్చారు.

## ముమ్మరంగా ఉబాలు

ప్రజాశక్తి - జియ్యమ్మవలస

మండలంలోని గత నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు కుదమ, గౌరీపురం, పరజపాడు, సింగనాపురం, తురకనాయుడువలస, కుందరతిరువాడ తదితర గ్రామాల్లో ముమ్మరంగా ఉబాలు జరుగుతున్నాయి. వరినారు అందకపోవడంతో అనేక చోట్ల ఇంకా ఉడుపులు ప్రారంభించకపోయినా వరి నారు అందిన చోటల్లా దమ్ములు ప్రారంభించారు. దీంతో రైతులు వ్యవసాయ పనులు బిజీబిజీగా ఉన్నారు.

ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులతో మాట్లాడుతున్న డిఎంహెచ్ఒ

## చినమేరంగిలో డిఎంహెచ్ఒ పర్యటన

ప్రజాశక్తి - జియ్యమ్మవలస

మండలంలోని చినమేరంగి దళితవాడలో విజృంభిస్తున్న విష జ్వరాలు అన్న ప్రజాశక్తి వార్తకు స్పందించిన జిల్లా వైద్యాధికారి కె.విజయ పార్వతి సోమవారం చినమేరంగిలో పర్యటించారు. స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో జ్వర పీడితులను కలిసి వివరాలడిగి తెలుసుకున్నారు. అలాగే రోగులకు చేస్తున్న పరీక్షలను ల్యాబ్ రిపోర్టులను పరిశీలించారు. అనంతరం మలేరియా, డెంగీ వంటి ప్రమాదకర జ్వరాలపై వైద్యులు అప్రమత్తంగా ఉండాలని అందుకు కావాల్సిన మందులు సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. స్థానిక దళితవాడను ఆనుకుని ఉన్న దాలమ్మ కోనేరును సందర్శించారు. ఈ జ్వరాలకు దాలమ్మ కోనేరు మురుగునీరే కారణమని బాధితులు చెప్పడంతో ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్తామని ఆమె తెలిపారు. స్థానిక పెద్దలు అల్లు ఈశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి సూచనల మేరకు చెరువులోని నీటిని వాటర్ ఇంజన్ల ద్వారా బయటికి పంపే ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎంపిడిఒ శ్రీనివాసరావు తెలిపారు. అనంతరం దళితవాడలో జియ్యమ్మవలస పిహెచ్‌సి వైద్యాధికారు డాక్టర్ పి.జగదీష్, డాక్టర్ ప్రసన్న ఆధ్వర్యాన మెడికల్ క్యాంప్‌ను నిర్వహించారు. కార్యక్రమంలో సిహెచ్‌సి వైద్యాధికారులు సునీల్ కుమార్, ప్రతిమ, రమ్య, ప్రభుతేజ, మలేరియా సూపర్వైజర్ రాధాకృష్ణ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## సమస్యలపై దృష్టి సారించండి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

పట్టణంలో గల సమస్యలను పరిష్కరించాలని వినియోగదారుల సంఘం సభ్యులు మున్సిపల్ కమిషనర్ కె.శ్రీనివాస్‌ను కోరారు. సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో గల కమిషనర్‌ను వినియోగదారుల సంఘం సభ్యులు కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలని, పట్టణంలో కుక్కల బెడద విపరీతంగా ఉన్నందున వాటిపై నివారణ చర్యలు వెంటనే తీసుకొని, పట్టణ ప్రజలు రాబిస్ వ్యాధి బారిన పడకుండా చూడాలని, ఈ సమస్యను పరిష్కారం దిశగా అడుగులు వేయాలని కోరారు. కార్యక్రమంలో అధ్యక్షులు పెంట పాటి సూర్యారావు, జనరల్ సెక్రెటరీ మాన్యం రామకష్ణ, సభ్యులు భూ రగాన రంగా, ఈశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

పట్టణంలో చేపడుతున్న పారిశుధ్య పనులు

## పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి

ప్రజాశక్తి -పార్వతీపురం టౌన్

పట్టణంలోని అన్ని వార్డుల్లో పారిశుధ్య నిర్వహణకు ప్రత్యేక దృష్టి పెట్టినట్టు మున్సిపల్ కమిషనర్ కె.శ్రీనివాస్ అన్నారు. పారిశుధ్య పక్షోత్సవాలలో భాగంగా సోమవారం 1, 2,3,4,13,14 వ వార్డుల్లో పారిశుధ్య కార్మికులతో గ్యాంగ్ వర్క్స్, డిసిల్టింగ్, యాంటీ లార్వా స్ప్రేయింగ్, ఫాగింగ్ తదితర పనులు నిర్వహించారు. అనంతరం స్టాప్ డయేరియా కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ప్రజారోగ్య విభాగం అధికారులు, సిబ్బంది, శానిటరీ సెక్రెటరీలు, , మేస్త్రీ పాల్గొన్నారు.

**భామిని :** మండలంలోని బాలేరు పిహెచ్ సి పరిధిలోని నల్లారాయి గూడ, సోలికిరిలో వైద్యాధికారి డాక్టర్ శివకుమార్ ఆధ్వర్యంలో డెంగీ వ్యతిరేక మాసోత్సవం ర్యాలీని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలని, ఇంటి పరిసరాలలో నీటి నిల్వలు లేకుండా చూడాలని, దోమ తెరలను వాడాలని, దోమల మందు పిచికారీని ప్రతీ ఇంట చేసుకోవాలని సూచించారు. కార్యక్రమం లో మలేరియా సబ్ యూనిట్ అధికారి అప్పారావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యార్థులకు వితరణ

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని నీలానగరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఆరుగురు విద్యార్థులు ట్రిపుల్ ఐటీకి ఎంపిక కావడంతో సోమవారం అదే గ్రామానికి చెందిన పాలవలస అమ్మడమ్మ, సన్యాసినాయుడు మెమోరియల్ ట్రస్ట్‌కు చెందిన పాలవలస గోపాలకృష్ణారావు విద్యార్థులకు వితరణ ఇచ్చారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ ఉన్నత శిఖరాలు అధిరోహించాలని విద్యార్థులను కోరారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి.రవి ప్రసాద్‌తో పాటు సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

## మున్సిపాలిటీలో అవినీతిపై ఫిర్యాదు

ప్రజాశక్తి - సాలూరు

మున్సిపాలిటీ లో గత కొంతకాలంగా జరిగిన అవినీతిపై పట్టణానికి చెందిన వైసిపి నాయకులు బవిరెడ్డి ప్రసాద్ సోమవారం జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా ఖర్చు నిమిత్తం ప్రభుత్వం రూ.4.2లక్షలు మంజూరు చేసిందని, వాస్తవానికి మొత్తం కార్యక్రమాలకు లక్ష రూపాయల లోపే ఖర్చు జరిగిందని చెప్పారు. తప్పుడు బిల్లులు పెట్టి ప్రభుత్వ ధనం కాజేశారని ఆరోపించారు. ఈ వ్యవహారంలో శానిటేషన్ ఇన్‌స్పెక్టర్, అకౌంటెంట్, కమిషనర్ కుమ్మక్కై నిధులు స్వాహా చెప్పారు. పారిశుధ్య విభాగంలో వాహనాల నిర్వహణకు సంబంధించి డీజిల్ వినియోగం లోనూ తప్పుడు బిల్లులు సృష్టించి డబ్బులు కాజేస్తున్నారని ఫిర్యాదు చేశారు.

## సీజనల్ వ్యాధులపై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి - సాలూరు

పరిసరాల పరిశుభ్రత, సీజనల్ వ్యాధులపై అవగాహన పెంచుకోవాలని కోరుతూ సోమవారం నీడ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యాన మండలంలోని కురుకుట్టిలో విద్యార్థినిలతో ర్యాలీ నిర్వహించారు. నీడ్ డైరెక్టర్ పి.వేణుగోపాలరావు ఆధ్వర్యాన నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో భాగంగా వీధుల్లో ర్యాలీ చేపట్టారు. పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. వర్షాలు అధికంగా పడుతున్న కారణంగా మలేరియా, డెంగీ జ్వరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనంతరం పాఠశాల విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో నీడ్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు మోహన్‌రావు, కనకరత్నం, పాఠశాల హెచ్ఎం ప్రసన్న గణేష్ పాల్గొన్నారు.

## అగ్నిఅస్త్రంతో చీడ పురుగుల నివారణ

ప్రజాశక్తి - సాలూరురూరల్

మొక్కజొన్న పంటలో చీడ పురుగులను అగ్నస్త్రం కషాయంతో నివారించవచ్చునని ప్రకృతి వ్యవసాయ మండల మోటివేటర్ పెద్దింటి అనురాధ తెలిపారు. మండలంలోని మామిడిపల్లిలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఆధ్వర్యంలో తాడ్డి శంకర్రావు అనే రైతు అగ్నస్త్రం తయారీ చేశారు. దీన్ని పరిశీలించిన ఆమె మాట్లాడుతూ ఈ కాషాయం ఒక ఎకరానికి మూడు లీటర్లు వంద లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. రసాయన ఎరువులు కంటే చాలా వరకు ఖర్చులు తక్కువవుతాయని ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు

## సమస్యలు పరిష్కరించండి

ప్రజాశక్తి - సీతంపేట

తమ సమస్యలు పరిష్కరించాలని పలువురు గిరిజనులు స్పందనలో వినతులు సమర్పించారు. సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక ఐటిడిఎలో డిడి ఎం.అన్నదొర ఆధ్వర్యంలో నిర్వహించారు. పద్మాపురానికి చెందిన ప్రకాష్, రామానగరం చెందిన శంకర్రావు, పెద్ద తంకిడి చెందిన లక్ష్మి రోడ్లు మంజూరు చేయాలని కోరారు. బిల్లగూడకు చెందిన అప్పన్న రైతు భరోసా మంజూరు చేయాలని, గోలుకుప్పగూడకు చెందిన ప్రమీల జిఎన్ఎం పోస్ట్, పెద్దూరుకు చెందిన భవాని ఎఎన్ఎం పోస్టు ఇప్పించాలని కోరారు. జోగిపాడుకు చెందిన సంతమ్మ వితంతు పింఛను మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.

## నదిలోకి ఎవరూ దిగొద్దు

ప్రజాశక్తి - కొమరాడ

నాగావళి నదిలో నీరు ఉధృతంగా ప్రవహిస్తున్న సమయంలో ప్రజలు ఎవరు నదిలో దిగకూడదని తహశీల్దార్ ఎస్.రమేష్ అన్నారు. సోమవారం కొమరాడలో సమీపాన గల నాగావళి నది నీటి ప్రవాహాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నదిలో నీటి ప్రవాహం అధికంగా ఉన్నందున ప్రజలెవరు నదిలో దిగకూడదన్నారు. కురుస్తున్న వర్షాలు కారణంగా నదిలో నీటి ప్రవాహం పెరిగే అవకాశం ఉందన్నారు. కాబట్టి నదీ పరివాహక ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేసేందుకు సచివాలయ సిబ్బంది ఆయా గ్రామాల్లో దండారో వేయించారు. ముఖ్యంగా నీటి ప్రవాహం పెరిగే సమయంలో చేపల వేటకు ప్రజలెవరు వెళ్లకూడదని హెచ్చరించారు. ఆయన వెంట ఆర్ఐ శ్రీనివాసరావు, విఆర్ఒలు, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

రోడ్డుపై గొయ్యిలను కప్పిస్తున్న ఆర్అండ్‌బి జెఇ

## రహదారికి మరమ్మతులు

ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి - గరుగుబిల్లి

మండలం లోని ఉల్లిభద్ర వద్ద తోటపల్లి కుడి ప్రధాన కాలువ వద్ద గుర్రైన రోడ్డుకు అధికారులు సోమవారం మరమ్మతులు నిర్వహించారు. 'ప్రజాశక్తి'లో సోమవారం ప్రచురితమైన రోడ్ల దుస్థితిపై అధికారులు స్పందించారు. ఈ మేరకు ఆర్అండ్‌బి జెఇ ప్రమీల దగ్గరుండి గోతులయమైన రోడ్డును గ్రావెల్‌తో పూడ్చుతున్నారు. అయితే సిసి రోడ్డు నిర్మిస్తే ఈ సమస్య శాశ్వత పరిష్కారమవుతుందని జెఇ తెలిపారు.

# గిరిజన సమస్యలు పరిష్కరించాలి

### ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు

ప్రజాశక్తి - సాలూరు రూరల్

ఎన్నో ఏళ్లుగా గిరిజనుల కనీస మౌలిక వసతుల్లేక చాలా ఇబ్బందులకు గురవుతున్నారని ఇప్పటికైనా అధికారులు స్పందించి గిరిజన సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్‌కు ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు వినతిని అందజేశారు. మండలంలో 29 పంచాయతీలు సుమారు 294 గ్రామాల్లో కనీసం మౌలిక సదుపాయాలైన రోడ్లు, మంచినీళ్లు, విద్య, వైద్యం సదుపాయాలు అందంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సాగు భూములకు పట్టాలివ్వాలని, సాగునీటి వనరులపై చెక్‌డాంలు నిర్మించాలని, అటవీ ఉత్పత్తులకు కనీస గిట్టుబాటు ధర కల్పించాలని కోరారు. పీసా చట్టాన్ని సక్రమంగా అమలు చేయాలని, షెడ్యూల్లో లేని గ్రామాలు అన్నిటిని షెడ్యూల్ గ్రామాలుగా ప్రకటించాలని కోరారు. గిరిజన ప్రాంతాల్లో కుటీర పరిశ్రమలు ఏర్పాటు చేసి యువతకు ఉపాధి కల్పించాలని, మామిడిపల్లిలో జూనియర్ కళాశాల, సాలూరు పట్టణంలో ఆశ్రమ పాఠశాల ఏర్పాటు చేయాలని, సబ్సిడీపై వ్యవసాయ పనిముట్లు సరఫరా చేయాలని, నార్లవలస పంచాయతీ పెద్దవలస గ్రామానికి దిగు భాగాన రక్షణ గోడ నిర్మించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు సీదరపు అప్పారావు, మండల అధ్యక్షులు గెమ్మెల జానకీరావు, కమిటీ సభ్యులు మెల్లిగా అయోధ్య, వ్యవసాయ కార్మిక సంఘం సహాయ కార్యదర్శి మర్రి శ్రీనివాసరావు, మండల కార్యదర్శి తాడంగి గాసి పాల్గొన్నారు.

**గిరిజన విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలి**

గిరిజన వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలని గిరిజన విద్యార్థి నాయకులు చెల్లూరి సీతారాం, జట్ల బంగార్రాజు జాయింట్ కలెక్టర్ ఎస్ఎస్ శోభికకు వినతి పత్రాన్ని అందజేశారు. గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు పౌష్టికాహారం అందించి ప్రతి నెలా ఉచిత వైద్య పరీక్షలు, వైద్య శిబిరాలు నిర్వహించాలని, ప్రతీ ఆశ్రమ పాఠశాలల్లో ఇద్దరు చొప్పున ఆరోగ్య సిబ్బందిని నియమించాలని కోరారు.

**రైతు బజార్ ప్రారంభించాలి**

**సాలూరు** పట్టణంలో అనేక ఏళ్ల క్రితం నిర్మించిన రైతు బజార్‌ను ప్రారంభించాలని సిపిఎం నాయకులు ఎన్‌వై నాయుడు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. మున్సిపాలిటీకి రెగ్యులర్ కమిషనర్‌ను నియమించాలని, ప్రభుత్వ ఐటిఐ, గ్రంథాలయం నిర్మాణానికి స్థలాలు కేటాయించాలని కోరారు. గిరిజన సామాజిక భవనం నిర్మించాలని, మంజూరైన గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలని వెంటనే ప్రారంభించాలని కోరారు. సిపిఎం పట్టణ కమిటీ సభ్యులు టి.స్వప్న, టి.శంకరరావు వున్నారు.

విచారణ చేపడుతున్న ఆర్‌డిఒ హేమలత

## వైద్యాధికారి వెంకటరమణపై విచారణ

ప్రజాశక్తి - పాచిపెంట

స్థానిక పిహెచ్‌సి వైద్యాధికారి జి.వెంకటరమణపై అందించిన ఫిర్యాదు మేరకు ఆర్‌డిఒ కె.హేమలతో సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో విచారణ నిర్వమించారు. నిబంధనలకు విరుద్ధంగా పలువురు ఆశా కార్యకర్తలు, సిహెచ్‌డబ్ల్యూల నియమకాలు చేపట్టనట్టు పాచిపెంట సర్పంచ్ పి.సంతోషి ఫిర్యాదు చేశారు. అలాగే తమను హాస్పిటల్ అభివృద్ధి కమిటీలో చేర్పించలేదని, పిహెచ్‌సి ఆవరణలో శిథిల భవనాలు తొలగింపుతో వచ్చిన ఇనుము, ఇతర సామాగ్రి ఏమైందోనని ఫిర్యాదు చేశారు. అలాగే సాలూరు మండలం కురుకూటికి చెందిన ఒక వ్యక్తి నుంచి తనకు ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి కొంత నగదు వెంకటరమణ తీసుకున్నారన్నారు. అలాగే స్థానిక సర్పంచ్ సంతోషి పిహెచ్‌సి పరిధిలో విధులు నిర్వహిస్తున్న కొంతమంది ఆశా వర్కర్లు విచారణకు హాజరయ్యారు. అనంతరం ఆర్‌డిఒ విలేకరులతో మాట్లాడుతూ విచారణ నివేదికను కలెక్టరుకు అందజేయనున్నట్టు తెలిపారు.

## విద్యార్థి కుటుంబ సభ్యులకు డిఎంఒ పరామర్శ

### గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలోని వంగర గ్రామాన్ని జిల్లా మలేరియా అధికారి మణి సోమవారం సందర్శించారు. మలేరియా జ్వరంతో మృతి చెందిన గౌతం కుటుంబ సభ్యులను పరామర్శించారు. విద్యార్థి మృతిపై పూర్తి వివరాలను కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో ప్రతి ఇంటి వద్ద ఫాగింగ్ లార్వాస్ చేయించారు. అనంతరం వైద్య శిబిరం నిర్వహించి ప్రతి ఒక్కరికీ ఆరోగ్య పరీక్షలు చేయించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, గతంలో పంపిణీ చేసిన దోమతెరల వాడకం చేపట్టాలని, కాచి మరుగబెట్టిన నీటిని తాగాలని గ్రామస్తులకు సూచించారు. కార్యక్రమంలో తాడికొండ పిహెచ్‌సి వైద్యాధికారి బుద్దేశ్వరరావు, సలహాదారు రామచంద్రరావు, మలేరియా సబ్ యూనిట్ అధికారి మోహన్‌రావు, ఎంటిఎస్ కేశవరావు, సిబ్బంది శ్రీనివాసరావు, రాధాకష్ణ తదితరులు ఉన్నారు.

## టిఎల్‌ఎం ప్రదర్శనలు విద్యార్థులకు ఉపయోగం

ప్రజాశక్తి - బలిజిపేట

టిఎల్‌ఎం ప్రదర్శనలు విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడతాయని స్థానిక ఎంఇఒ-1 సామల సింహాచలం అన్నారు. శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా స్థానిక ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్ ప్రదర్శనను ఎంఇఒ ప్రారంభించారు. ఈ ప్రదర్శనలో విద్యార్థులు, ఉపాధ్యాయులు తయారు చేసిన వివిధ సబ్జెక్టులకు సంబంధించిన ప్రాజెక్టులు, పాఠ్యఅంశాల ఆధారిత పరికరాలను హెచ్‌ఎంతో కలిసి పరిశీలించారు. విజ్ఞాన దాయకమైన ప్రోజెక్టు లను తయారు చేసిన విద్యార్థులను, టీచర్లను అభినందించారు. అనంతరం ఎంఇఒ మాట్లాడుతూ ఈనెల 28 వరకు అన్ని పాఠశాలల్లో శిక్షా సప్తాహ్‌లో వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం పి.శ్రీనివాసరావు, ఎం.పైడపు నాయుడు, అజయ్ ప్రసాద్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## బస్సును ఢీకొన్న ఆయిల్ ట్యాంకర్

### ప్రయాణికులకు స్వల్ప గాయాలు

ప్రజాశక్తి -కొమరాడ

ఆర్టీసి బస్సు, ఆయిల్ ట్యాంకర్ ఢీకొన్న ఘటన మండలంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం పార్వతీపురం ఆర్టీసీ డిపోకు చెందిన బస్సు పార్వతీపురం నుంచి కోనేరు వైపు వెళ్తుంది. అదే సమయంలో ఒడిశా నుంచి విశాఖపట్నం వైపు వెళ్తున్న ఆయిల్ ట్యాంకరు గుమడ గ్రామ సమీపాన అదుపుతప్పి ఢీకొంది. ఈ ఘటనలో బస్సులో ఉన్న ముగ్గురు ప్రయాణికులకు స్వల్పంగా గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న కొమరాడ ఎస్సై తన సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకొని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. అనంతరం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. బస్సు ప్రమాదానికి గురి కావడంతో బస్సులో ఉన్న ప్రయాణికులు తమ గమ్యస్థానానికి వెళ్లేందుకు ఆటోల కోసం తీవ్ర ఇబ్బందులు పడాల్సి వచ్చింది.

**ప్రయాణికుల ప్రాణాలకు భరోసా లేదు**

పార్వతీపురం ఆర్టీసీ బస్సులో ప్రయాణించే ప్రయాణికుల ప్రాణాలకు భరోసా లేదని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి విమర్శించారు. ఈ డిపో పరిధిలో జిల్లాలోని అన్ని రూట్లోకి వెళ్లేలా ప్రయాణికులకు భరోసా కల్పించేందుకు 90 బస్సుల ఉండాల్సి ఉండగా కేవలం 68 బస్సులు మాత్రమే ఉన్నట్లు తెలుస్తుందన్నారు. ఈ బస్సుల్లో కూడా కాలం చెల్లినవి కూడా ఉన్నాయన్నారు. దీంతో ప్రయాణికులకు భరోసా ఉండడంలేదన్నారు. ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు స్పందించి మంచి బస్సులను నడిపి ప్రయాణికుల ప్రాణాలకు భరోసా కల్పించాలని కోరారు. అలాగే బస్సు ప్రమాదంలో గాయపడ్డ క్షతగాత్రులకు మెరుగైన చికిత్స అందించాలని కోరారు.

## గడ్డి మందు తాగి వృద్ధురాలు మృతి

పజాశక్తి -కొమరాడ

మండలంలోని చలివేంద్రికి చెందిన కోడూరు వరహాలమ్మ (74) మనస్థాపానికి గురై గడ్డి మందు తాగి మృతి చెందింది.పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. వరహాలమ్మకు కుమార్తెలు, కుమారులున్నప్పటికీ వారు ఆమె బాగోగులు చూడకపోవడంతో మనస్థాపానికి గురై ఆదివారం గడ్డి మందు సేవించి ఆత్మహత్యకు పాల్పడింది. ఇది గమనించిన కుమారులు వైద్యం కోసం శ్రీకాకుళం జేమ్స్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది.